క్లుప్తంగా

అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరు



పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నేతలు

తోటపల్లిగూడూరు : అక్రమ అరెస్టులతో సీపీఎం చేస్తున్న పోరాటాలను ఆపలేరని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్ష, కార్యదర్శులు జొన్నలగడ్డ వెంకమరాజు, మంగళం పుల్లయ్య అన్నారు. మండలంలోని పాపిరెడ్డిపాళెం భూముల్లో గుడిసెలు నిర్మించుకున్న పేదలకు అండగా నిలిచిన పలువురు సీపీఎం నేతలను స్థానిక పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నేతలు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని కార్యకర్తలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని పాపిరెడ్డిపాళెం సర్వే నంబర్–497లోని 10.08 ఎకరాల ఇనామ్ భూమి గత పదిహేను ఏళ్లుగా స్థానిక గ్రామాలకు చెందిన పేదల స్వాధీనంలో ఉందన్నారు. అయితే ఆ భూమిని పేదలకు దక్కకుండా అధికార పార్టీ నేతలు పన్నాగం పన్నుతున్నారన్నారు. కొందరు దొంగ పట్టాలు సృష్టించుకుని అధికార పార్టీ నేతలకు కొమ్ము కాస్తూ పేదల కడుపు కొట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే తామే స్వచ్ఛందంగా గుడిసెలు తీసేస్తామని ఎంత చెప్పినా వినకుండా జేసీబీలతో 350 పూరి గుడిసెలను కూలదోయడం అన్యాయమన్నారు. దీనిని ప్రశ్నించిన స్థానిక సీపీఎం నాయకులను ఈడ్చుకెళ్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం అమానుషమన్నారు. అక్రమ అరెస్టులతో సీపీఎం చేస్తున్న ఉద్యమాలను అడ్డుకోలేరని, అధికార పార్టీ నేతలు గుర్తించుకోవాలన్నారు. పాపిరెడ్డిపాళెం భూముల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మహిళా నాయకురాలు కాల్తిరెడ్డి రమణమ్మ, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

రొయ్యలపాళెం రైతులను ఆదుకోవాలి




తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ముత్తుకూరు : మండలంలోని రొయ్యలపాళెం దళిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి ఆయన కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి గడ్డం అంకయ్య, సీనియర్ నాయకుడు నక్కా రాధయ్య, మండల సభ్యులు షేక్ మస్తాన్ షా, ఏడుకొండలు తదితరులు మాట్లాడారు. సాగరమాల నిర్మాణం కోసం దళితుల భూములను ధ్వంసం చేశారని తెలిపారు. వ్యవసాయానికి పనికిరాకుండా చేశారని వివరించారు. సేకరించిన భూములకు త్వరగా నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

యార్డు వ్యాపారులకు నోటీసులు

పొదలకూరు : స్థానిక ప్రభుత్వ నిమ్మమార్కెట్ యార్డులో దుకాణాలు తీసుకున్న వ్యాపారులకు మార్కెటింగ్ అధికారులు బుధవారం నోటీసులు జారీ చేశారు. వీటిని ఇన్‌చార్జి సెక్రటరీ రఘు దుకాణాలకు అంటించారు. ఇక్కడి దుకాణాలను వేలంలో దక్కించుకున్న వారు వ్యాపారాలు చేయకుండా అద్దెకు ఇస్తున్నారని మార్కెటింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో జూన్‌లో గుంటూరు మార్కెటింగ్‌శాఖ విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో 12 దుకాణాలకు సంబంధించి సజావుగా వ్యాపారాలు చేయడం లేదని, అద్దెకు ఇచ్చారని పేర్కొంటూ నోటీసులు అందజేశారు. మూడు రోజుల్లో దుకాణాలను ఖాళీ చేసి తమకు అప్పగించాల్సిందిగా నోటీసుల్లో పేర్కొన్నారు. కాగా గతేడాది యార్డులో 24 దుకాణాలకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహించారు. వాటిలో పది మంది అగ్రిమెంట్లు చేయించుకోకుండా వదిలేశారు. మిగిలిన 14 దుకాణాలను వ్యాపారులు అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే దుకాణాలను అద్దెకు తీసుకున్న వారు వ్యాపారాలు చేయడం లేదని టీడీపీ నాయకులు మార్కెటింగ్ జేడీకి ఫిర్యాదు చేశారు. దీంతో 14 దుకాణాల్లో ఇద్దరే వ్యాపారాలు చేస్తున్నారని, మిగిలిన వారు ఖాళీ చేయాల్సిందిగా అధికారులు నోటీసులు అంటించారు.

బీరువా వితరణ



బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీలోని పాత కాశీపాళెం విశ్రాంత టీచర్ బొజ్జా వెంకటరమణయ్య మండల విద్యాశాఖ కార్యాలయానికి బుధవారం బీరువా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు ఎం.దిలీప్‌కుమార్, పీవీ రత్నంలు దాతను సత్కరించి అభినందనలు తెలిపారు.

క్రీడా పాలసీ.. ఎవరికి ప్రయోజనం..?

- ప్రణాళికపై స్పష్టత కరువు
- క్రీడాప్రాధికార సంస్థలో జీతభత్యాలకు కటకట
- చాలీచాలని వసతులతో క్రీడాకారుల అవస్థ



స్టేడియంలో ఏపుగా పెరిగిన గడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): క్రీడాప్రాధికార సంస్థలో చాలీచాలని వసతులు.. జీతభత్యాలకు కటకట.. క్రీడా మైదానాలకు కానరాని నిర్వహణ నిధుల మధ్య నూతన క్రీడా పాలసీని రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. అసలు ఈ పాలసీ ద్వారా ఎవరికి ప్రయోజనమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ప్రకటించిన పాలసీ మేరకు రాష్ట్ర, జాతీయ, ఆసియన్, ఒలంపిక్స్‌తో పాటు ఖేలో ఇండియా క్రీడల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు నగదు బహుమతులను ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వోద్యోగాల్లో ప్రస్తుతం అమలు చేస్తున్న రెండు శాతం రిజర్వేషన్‌ను మూడు శాతానికి పెంచారు.

క్రీడాకారులను తీర్చిదిద్దేదెలా..?

ఉన్నత స్థాయికి ఒక సాధారణ క్రీడాకారుడు చేరుకునేందుకు సంబంధించిన ప్రణాళికపై క్రీడా పాలసీలో స్పష్టత కొరవడింది. క్షేత్రస్థాయిలో క్రీడాకారులను ఎలా సన్నద్ధం చేస్తారనే అంశమై ఎలాంటి విధి విధానాలను ప్రకటించలేదు. ప్రస్తుతం క్రీడా ప్రాధికార సంస్థలో ఉన్న ఉద్యోగులకు జీతభత్యాలను నెలవారీగా అందించే పరిస్థితి లేదు. మైదానాలూ అంతంతమాత్రమే. క్రీడా పరికరాల్లేకపోవడంతో క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ఎలా మెరుగుపర్చుకుంటారనే సందేహం ఉత్పన్నమవుతోంది.

అమలు కాని నిబంధనలు

పాఠశాల స్థాయిలో క్రీడాకారులను గుర్తించే ఖేలో ఇండియా జాతీయ స్థాయిలో ఉన్న నిబంధనలు ఇక్కడ అమలు కావడం లేదు. రాష్ట్రంలోని క్రీడా మైదానాలకు నిర్వహణ నిధుల్లేకపోవడంతో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధించడం.. ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకాలను అందుకోవడం అసాధ్యమని రాజకీయాలతో సంబంధం లేని సీనియర్ క్రీడాకారులు అభిప్రాయపడుతున్నారు.



సాధన చేస్తున్న క్రీడాకారులు (ఫైల్)

లింగ నిర్ధారణ చేస్తే కేసులు



రికార్డులను పరిశీలిస్తున్న ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ చేశారని తేలితే కేసులు నమోదు చేస్తామని ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ స్పష్టం చేశారు. నగరంలోని జయభారత్.. సాయికిరణ్ మెటర్నిటీ, ఫెర్టిలిటీ ఆస్పత్రులు.. దీప్తి ఫెర్టిలిటీ సెంటర్ తదితర కేంద్రాలను వైద్యశాఖ మాస్ మీడియా అధికారి కనకరత్నంతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు, గర్భిణులకు సంబంధించిన స్కాన్ ఫారమ్ – ఎఫ్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పీసీ అండ్ పీఎన్డీటీ చట్టం మేరకు స్కానింగ్ చేసిన గర్భిణుల వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేయాలన్నారు. నివేదికలను వైద్య శాఖ కార్యాలయంలోని డెమో విభాగంలో ప్రతి నెలా రెండులోపు సమర్పించాలని సూచించారు. తొలుత జిల్లా ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ అధికారి డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో పలు ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. శ్రావణ్‌కుమార్, మునిమహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్.. దుర్గంధం

- జెడ్పీ కార్యాలయంలో ఇదీ దుస్థితి
- రోడ్డుపైకి వస్తున్న మురుగు
- స్పందించని అధికారులు



నెల్లూరు (పొగతోట): నగరంలోని జెడ్పీ కార్యాలయంలో మురుగు రోడ్డుపై పారుతోంది. నెలలుగా ఇదే సమస్య నెలకొనడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ విషయమై అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. నిత్యం వందలాది మంది ప్రజలు, అధికారులు కార్యాలయానికి వస్తుంటారు. సర్వసభ్య, స్థాయీ సంఘ సమావేశాలు, డీఆర్సీ తదితరాలకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు హాజరవుతుంటారు. అయినా ఇక్కడ దుర్గంధం వెదజల్లుతుండటంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అయ్యప్ప మాలధారణ



నెల్లూరు(బృందావనం): నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అయ్యప్ప దేవస్థానానికి బుధవారం విచ్చేసి మాలధారణను స్వీకరించారు. అనంతరం వీరికి అన్నప్రసాదాన్ని అందజేశారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదాలతో మానుగుంట భేటీ



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. పలు అంశాలపై వీరు చర్చించారు.

నగరపాలక సంస్థ ఉద్యోగులకు శిక్షణ



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ ఉద్యోగులకు ఎన్‌ఐసీ ద్వారా శిక్షణను బుధవారం నిర్వహించారు. ఈ – ఆఫీస్, ఈ – ఫైలింగ్ నిర్వహణపై పలువురు శిక్షణ పొందారు. కమిషనర్ సూర్యతేజ సూచనల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కమిషనర్ నందన్, మేనేజర్ ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా సుబ్బారావు బాధ్యతలను బుధవారం స్వీకరించారు. ఆయనకు పుష్పగుచ్ఛాలను సిబ్బంది అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీ తదితరులను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉపాధ్యాయులకు శిక్షణను రద్దు చేయాలి

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్, లీడర్‌షిప్ రెసిడెన్షియల్ శిక్షణలను వెంటనే రద్దు చేయాలని బీటీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మణి సుబ్బు, ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో లీడర్‌షిప్ ట్రైయినింగ్ ప్రోగ్రామ్‌కు హాజరైన హెచ్‌ఎం తోట వెంకటరత్నకుమార్ మృతి చెందడం బాధాకరమని చెప్పారు. అనేక యాప్‌లతో ఉపాధ్యాయులు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నెల్లూరు (సెంట్రల్): నెల్లూరు రూరల్ పరిధిలోని అన్ని డివిజన్లపై ప్రత్యేక శ్రద్ధ వహించి అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తూరు సమీపంలోని నక్కా గోపాల్‌నగర్‌లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనను బుధవారం ఆయన చేపట్టారు.

'అరబిందో'ను తొలగించాలి

నెల్లూరు (సెంట్రల్): రాష్ట్రంలో 108 అంబులెన్స్‌లను నిర్వహిస్తున్న అరబిందో సంస్థను తొలగించాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. సదరు సంస్థ నిబంధనలను పాటించడంలేదని ఆరోపించారు.

చిన్నారులను పనిలో పెట్టుకుంటే చర్యలు

నెల్లూరు (సెంట్రల్): పరిశ్రమలు, దుకాణాల్లో చిన్నారులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని జిల్లా ఉప కార్మిక కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నగరంలోని పలు షాపులను సహాయ కార్మిక కమిషనర్ గౌస్‌తో కలిసి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు బాలకార్మికులను గుర్తించారు. కార్మిక చట్టానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని సూచించారు.

ఉద్యోగుల జీతాల్లో కోత విధించడం దారుణం

నెల్లూరు(అర్బన్): ఆన్‌లైన్లో ఎఫ్ఆర్ఎస్ (ముఖ హాజరు) సక్రమంగా నమోదు కాలేదంటూ ఎన్‌హెచ్ఎం నర్సులు, సిబ్బందికి సంబంధించిన అక్టోబర్ నెల జీతాల్లో జిల్లా వైద్యశాఖాధికారులు కోత విధించడం దుర్మార్గమని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు యూనియన్ నేతలతో కలిసి డీఎంహెచ్‌ఓ పెంచలయ్యతో బుధవారం మాట్లాడారు. పల్లెల్లోని పీహెచ్‌సీలతో పాటు పలుచోట్ల ఇంటర్నెట్ సమస్య, సిగ్నల్ సక్రమంగా లేక సకాలంలో ముఖహాజరును వేయలేకపోతున్నారని చెప్పారు. విధులకు సమయానికి వచ్చి రికార్డుల్లో సంతకాలు చేసినా, ఆన్‌లైన్లో లోపాలతో ముఖహాజరు సమయం పలుచోట్ల ఆలస్యమవుతోందన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు ఒకే రకమైన విద్యార్హతలు, నియామక విధానాలు, డీఎస్సీ, ఆర్ఓఆర్ మెరిట్ ఆధారంగా నియమితులైనా, వీరికి మినిమమ్ టైమ్ స్కేల్‌ను అమలు చేయడం లేదన్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా.. ఆన్‌లైన్లో సాంకేతిక లోపాలను సరిదిద్దకుండా జీతంలో భారీగా కోతలు విధించడాన్ని ఆపాలని, లేని పక్షంలో ఆందోళనలను చేపడతామని తెలిపారు.

జీఓలను తక్షణమే విడుదల చేయాలి



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర ప్రభుత్వంతో ఆశ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాలపై జీఓలను వెంటనే విడుదల చేయాలని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ కోరారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ పెంచలయ్యకు వినతిపత్రాన్ని బుధవారం అందజేసిన అనంతరం ఆమె మాట్లాడారు. జీఓలను విడుదల చేయకపోవడంతో ఆశవర్కర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. జీఓలను జారీ చేయాలనే డిమాండ్‌తో కలెక్టరేట్ వద్ద ఆందోళనను ఈ నెల 18న చేపట్టనున్నామని చెప్పారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, కల్యాణి, అరుణ, ఉషా, మాధవి తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపును తొలగించాలంటూ ఆందోళన



స్థానికులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు



ఆందోళన చేస్తున్న సమీర్‌ఖాన్, మైనార్టీ నేతలు

నెల్లూరు(క్రైమ్): నగరంలోని వాకర్స్ రోడ్డు పరమేశ్వరినగర్ వద్ద ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలంటూ స్థానికులు మంగళవారం నుంచి ఆందోళన చేపట్టారు. నిర్వాహకులు పట్టించుకోకుండా విక్రయాలు సాగిస్తుండగా మైనార్టీ నేతలు, స్థానికులు బుధవారం షాపు ఎదుట బైఠాయించి ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నేత సమీర్‌ఖాన్ మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా జనావాసాలు, ప్రార్థన మందిరాలు, పాఠశాలలకు సమీపంలో మద్యం షాపును ఏర్పాటు చేయడం దారుణమన్నారు. దీంతో శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదముందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తక్షణమే షాపును తొలగించేలా కలెక్టర్ చర్యలు చేపట్టాలన్నారు. షాపును తొలగించేంత వరకు ఆందోళనను విరమించేది లేదని స్పష్టం చేశారు. సమాచారం అందుకున్న చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు, నెల్లూరు – 1 ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌బాబు తమ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. సమస్యను కలెక్టర్, ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో జేసీ, డీఆర్వో, ఎక్సైజ్ అధికారులను పలువురు స్థానికులు, మైనార్టీ నేతలు కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు.

కమిషనర్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు



నెల్లూరు(బారకాసు): కమిషనర్ సూర్యతేజను కాంగ్రెస్ పార్టీ నేతలు బుధవారం కలిశారు. మాజీ ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని నగరంలోని వీరి విగ్రహాలను శుభ్రపర్చి అలంకరించేలా చూడాలని కోరారు. ఈ అంశమై వినతిపత్రాన్ని సమర్పించారు. నేతలు బాలసుధాకర్, అల్లావుద్దీన్, రామ్మోహన్‌రావు, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధనలక్ష్మీపురంలో మెగా రక్తదాన శిబిరం



నెల్లూరు సిటీ: ధనలక్ష్మీపురంలోని శ్రీచైతన్య విద్యా సంస్థల్లో రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. రక్తాన్ని నోవా బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సేకరించారు. విద్యాసంస్థల ఏజీఎం శ్రీకాంత్, కొండారెడ్డి, కళాశాల డీన్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

శివలీలా తరంగిణి సప్తాహం ప్రారంభం



శిరోమణిశర్మను సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ఆనంద నిలయంలో శివలీలా తరంగిణి సప్తాహాన్ని చక్రాల వారి ట్రస్ట్ సౌజన్యంతో పద్యసారస్వత పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. వ్యాస మహర్షి కాశీపై కోపించడం అనే అంశంపై ఆలూరు శిరోమణిశర్మ ఉపన్యసించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. సభా పోషకుడిగా నలుబోలు బలరామయ్యనాయుడు వ్యవహరించారు. లక్ష్మీనరసింహారావు, చక్రాల వెంకటలక్ష్మీనరసింహం, చక్కిరాల జయప్రసాద్, రమాదేవి, మైపాడు రాజా, మురళీకృష్ణ, జయప్రకాష్, రామకృష్ణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్ జయప్రదానికి పిలుపు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

నెల్లూరు (టౌన్): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం నిర్వహించనున్న చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీహర్ష పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను స్టోన్‌హౌస్‌పేటలోని కేవీసీ జూనియర్ కళాశాలలో బుధవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న రూ.3480 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర, ఉపాధ్యక్షుడు చరణ్, నేతలు విష్ణు, జీవన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ నేతల నిరసన



నెల్లూరు (టౌన్): విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నెల్లూరు విభాగ్ కన్వీనర్ రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇంజినీరింగ్ విద్యార్థులతో కలిసి అన్నమయ్య సర్కిల్లో బుధవారం చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం మోసం చేస్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలవుతున్నా, విద్యార్థులకు న్యాయం జరగలేదని ఆరోపించారు. ఏబీవీపీ సహాయ కార్యదర్శులు నవీన్, సుకుమార్, జోనల్ ఇన్‌చార్జి హేమంత్ పాల్గొన్నారు.